క్లుప్తంగా

సుబ్బారాయుడి మృతి తీరని లోటు

రాజమహేంద్రవరం రూరల్: మాజీ సర్పంచ్ ఆచంట వెంకట సుబ్బారాయుడి మృతి వైఎస్సార్ సీపీకి తీరని లోటు అని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. ఆయన శనివారం కాతేరులో సుబ్బారాయుడి పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు) తదితరులు నివాళులర్పించారు.

పాఠశాలకు వితరణ



రామకృష్ణంరాజు అందించిన స్టీల్ టేబుల్‌తో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కడియం: గ్రామంలోని ఏవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లెక్కల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సీహెచ్ రామకృష్ణంరాజు రూ.పది వేలు విలువైన స్టీల్ టేబుల్‌ను పాఠశాలకు అందించారు. ఈ టేబుల్‌ను శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.సత్యనారాయణకు అందజేశారు. అలాగే ఇంగ్లిషు ఉపాధ్యాయుడు ఎం.సుజియ శాస్త్రి బాలికల మరుగుదొడ్డి మరమ్మతుల కోసం రూ.4 వేలు అందజేశారు. ఈ సందర్భంగా స్టాఫ్ కార్యదర్శి గొల్లపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ తాను అడగగానే స్పందించి పాఠశాల అభివృద్ధికి సహకరించిన ఇద్దరు ఉపాధ్యాయులకూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రఫీయుద్దీన్, సువర్ణవేణి, డేవిడ్, నాగేశ్వరరావు, వీరబాబు పాల్గొన్నారు.

28 నుంచి తపాలా వారోత్సవాలు

రాజమహేంద్రవరం సిటీ: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 28 నుంచి నవంబర్ 3వ తేదీ వరకూ రాజమహేంద్రవరం తపాలా డివిజన్‌లో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహించనున్నట్టు పోస్టల్ సూపరింటెండెంట్ కె.శేషారావు తెలిపారు. ఆయన శనివారం మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా తపాలా శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 28న తపాలా ఉద్యోగులందరూ అవినీతికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తారన్నారు. ప్రజలకు అవగాహన కల్పించడానికి గ్రామసభలు జరుగుతాయన్నారు. తపాలా వినియోగదారుల సమస్యల పరిష్కారానికి నవంబర్ ఒకటిన సూపరింటెండెంట్ కార్యాలయంలో డాక్ అదాలత్ నిర్వహిస్తామన్నారు. పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు జరుగుతాయన్నారు.

29న గురువందనం

సీటీఆర్ఐ: శృంగేరి శారదా పీఠాధిపతి జగద్గురు భారతీ తీర్థస్వామి సన్యాసం స్వీకరించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా స్వర్ణోత్సవాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా గోదావరి గట్టు శంకర మఠంలో ఈ నెల 29వ తేదీ గురువందనం అనే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేరకు శృంగేరి శంకర మఠం ధర్మాధికారి వేలూరి వెంకట్రామయ్య శనివారం ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు ఉదయం నుంచి వైదిక కార్యక్రమాలు జరుగుతాయి. దానిలో భాగంగా 10 గంటలకు మహామహోపాధ్యాయ ప్రాచార్య శలాక రఘునాథ శర్మ ప్రసంగం ఉంటుంది.

ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాలి



ర్యాలీ చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

కంబాలచెరువు: స్థానిక ఆనం రోటరీ హాలులో ఈ నెల 28న నిర్వహించనున్న పీడీఎస్‌యూ 50 వసంతాల జాతీయ సభకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి కోటిపల్లి బస్టాండ్ వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా రంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ రంగాలు పెట్రేగిపోతున్నాయని, వాటిని ప్రభుత్వం నియంత్రణ చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు దాటినా ఇప్పటి వరకు విద్యారంగం కోసం ఎలాంటి ఆలోచన చేయలేదన్నారు. నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్యా రంగానికి తూట్లు పొడుస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.భానుప్రసాద్, జిల్లా సంయుక్త కార్యదర్శి ఇల్లా చంద్రశేఖర్, పట్టణ కార్యదర్శి దినేష్ బాబు, విక్రమ్, రోహిత్ పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వాల అందజేత

రాజమహేంద్రవరం రూరల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వికసిత భారత్ సంకల్పాన్ని చూసి రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజలు బీజేపీ సభ్యత్వం తీసుకుంటున్నారని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు అన్నారు. రూరల్ నియోజకవర్గ క్రియాశీల సభ్యత్వ కార్యాచరణ కార్యక్రమాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జి ఆకుల శ్రీధర్ ఆధ్వర్యంలో శనివారం హుకుంపేటలో నిర్వహించారు. సోము వీర్రాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి అతిథులుగా హాజరయ్యారు. ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మసకబారిన వెలుగులు

- మట్టి ప్రమిదలకు తగ్గిన డిమాండ్
- తయారీదారుల అవస్థలు



అమ్మకానికి సిద్ధంగా ఉంచిన మట్టి ప్రమిదలు



ఎండబెట్టిన మట్టి ప్రమిదలు

ధవళేశ్వరం: వెలుగుల పండగ దీపావళి అంటే పిల్లల నుంచి పెద్దలందరికీ ఎంతో ఇష్టం. నెల రోజుల ముందునుంచే పండగ కోసం ఎదురుచూస్తుంటారు. బాణసంచా కాల్చి ఉత్సాహంగా సంబరాలు చేసుకుంటారు. అయితే దీపావళి పండగ కోసం మట్టి ప్రమిదలు చేసేవారి జీవితాలు మాత్రం చీకట్లోనే ఉంటున్నాయి. గతంలో మట్టి ప్రమిదలకు ఎంతో డిమాండ్ ఉండేది. వాటి కొనుగోళ్లు కూడా జోరుగా సాగేవి. కానీ నేడు వీటికి డిమాండ్ బాగా తగ్గిపోయింది. మారుతున్న జీవన శైలితో అనేక మంది విద్యుద్దీపాలపైనే మక్కువ చూపుతున్నారు. పెద్ద మాల్స్‌లో దొరుకుతున్న రంగుల ప్రమీదలకు ఆకర్షితులవుతున్నారు.

తగ్గిన వినియోగం

మట్టి ప్రమదలను తయారు చేసుకుంటూ జీవనం పొందే కుమ్మర్ల కుటుంబాలు ప్రస్తుతం తీవ్ర ఆర్థిక ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నాయి. గతంలో మాదిరిగా వ్యాపారం సాగడం లేదు. దీపావళికి రంగుల ప్రమిదలతో పాటు చిచ్చుబుడ్లు కూడా దిగుమతి అవుతున్నాయి. గతంలో చిచ్చుబుడ్డిలను మట్టితో తయారు చేసేవారు. వాటిని ప్రజలను కొనుగోలు చేసి మందు కూరుకుని చిచ్చుబుడ్లు తయారు చేసుకునేవారు. కానీ నేటి బిజీ జీవితంలో ఎవ్వరికీ అంత ఖాళీ ఉండడం లేదు. మూడేళ్లుగా మట్టి ప్రమీదలు, చిచ్చుబుడ్ల వినియోగం బాగా తగ్గిపోయిందని వాటిని తయారు చేసే కుటుంబాల వారు చెబుతున్నారు. ఈ ఏడాదైనా అమ్మకాలు పెరుగుతాయని ఆశపడుతున్నారు. దీపావళి పండగ సమీపిస్తుండటంతో మట్టి ప్రమీదల తయారీ వేగవంతం చేశారు. గత నెలలో వర్షాలు అధికంగా పడటంతో తయారీలో కొంత ఆలస్యమైంది. సోమవారం నాటికి పూర్తి స్థాయిలో తయారీని పూర్తి చేసి అమ్మకానికి సిద్ధం చేయాలని మట్టి ప్రమిదల తయారీదారులు యోచిస్తున్నారు.

అందుబాటు ధర

మార్కెట్‌లో దొరికే రెడీమేడ్ వాటికంటే కంటే మట్టి ప్రమిదలు తక్కువ ధరకు లభిస్తున్నాయి. సైజును బట్టి డజను రూ.30 నుంచి రూ.40కి విక్రయిస్తున్నారు. వీటిని కొనుగోలు ద్వారా చేతి వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న ఆ కుటుంబాలకు మన వంతు సాయం అందించినట్లు అవుతుంది.

జీవనాధారం



మట్టి ప్రమిదలు, చిచ్చుబుడ్లు తయారు చేసి అమ్మడం ద్వారా వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. మూడు, నాలుగు నెలల ముందు నుంచే వీటి తయారీని మొదలుపెడతాం. తరతరాలుగా ఇదే వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాం.

– పి.సాంబమూర్తి, ధవళేశ్వరం

అమ్మకానికి సిద్ధం



దీపావళి సందర్భంగా మట్టి ప్రమిదలు, చిచ్చుబుడ్ల తయారీ దాదాపు పూర్తయ్యింది. తయారైన సరుకును అమ్మకానికి ఉంచాం. రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో అమ్మకాలకు సరుకును ఉంచుతాం. వ్యయ ప్రయాసలకు ఓర్చి వీటిని తయారుచేస్తున్నాం.

– మల్లేశ్వరరావు, ధవళేశ్వరం

ఎస్సై, కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రాము

కంబాలచెరువు: ఎస్సై, కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి కూటమి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు వై.రాము డిమాండ్ చేశారు. స్థానిక బాలోత్సవ భవనంలో శనివారం భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) జిల్లా విస్తృత సమావేశం జరిగింది. జిల్లా నాయకుడు వి.రాంబాబు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో రాము మాట్లాడుతూ ఎస్సై, కానిస్టేబుల్ ప్రిలిమ్స్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు తదుపరి ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, రాష్ట్రంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలన్నారు. సమావేశంలో జిల్లాలో యువత ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారం కోసం ఆందోళన, పోరాటాలు చేయాలని నిర్ణయించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రకాశం నగర్: మున్సిపాల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగింది. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా తాటిపాక మధు, అధ్యక్షుడిగా సంగిరెడ్డి రమణ, ప్రధాన కార్యదర్శిగా అల్లం వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా ముత్యాల మురళీకృష్ణ, సమన్వయ కార్యదర్శిగా కాకి అప్పలరాజు, ఉపాధ్యక్షులుగా దానాల దుర్గమ్మ, బంగారు నాగేశ్వరరావు, బంగారు వీర వెంకట గిరిబాబు కోశాధికారిగా గుడుపు వెంకటగిరి తదితరులు ఎంపికయ్యారు.

కమిషనర్ సారూ.. ఇటు చూడండి ఓమారు



రోడ్డు పక్కనే నిర్మించిన అక్రమ కట్టడం

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో అక్రమ కట్టడాల తొలగింపు, పారిశుధ్యం మెరుగు, ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టడం వంటి వాటిపై కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్ ప్రత్యేక దృష్టి సారించారు. తద్వారా నగరాన్ని సుందరంగా, పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు శానిటేషన్, హెల్త్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌ను ఏర్పాటు చేశారు. ఈ టీమ్‌లోని సిబ్బంది నగరంలో పర్యటిస్తూ అక్రమ కట్టడాలను, రోడ్డును ఆక్రమించి చేస్తున్న వ్యాపారాలను తొలగిస్తున్నారు. నగరాభివృద్ధి, ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా వీరు తీసుకున్న చర్యలను ప్రశంసించాల్సిందే. అయితే 12వ డివిజన్ పరిధిలోని ఆనాల వెంకట అప్పారావు రోడ్డు నుంచి పాత విమలమ్మ హాస్పిటల్ (ప్రస్తుతం శ్రీరామదాసు హాస్పిటల్) మీదుగా గాంధీపురం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి నివాసానికి వెళ్లే రోడ్డు మలుపులో అక్రమ కట్టడం వైపు దృష్టి సారించడం లేదు. ఐరన్ షట్టర్లతో రెండు షాపులను ఇక్కడ పర్మినెంట్‌గా నిర్మించారు. కానీ అధికారులు గానీ, టీమ్ సిబ్బంది గానీ అటువైపు కన్నెత్తి చూడడం లేదు. వీటి నిర్మాణం చేపట్టి దాదాపు నాలుగు నెలలు అవుతోంది. నిర్మాణదారులకు అధికార పార్టీ నాయకుల అండ ఉందా, పట్టణ ప్రణాళిక విభాగం అధికారుల మద్దతు ఉందా అనే అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.

పట్టణాల్లో పేదరికం నిర్మూలనకు కృషి



మాట్లాడుతున్న మెప్మా రాష్ట్ర మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్

రాజమహేంద్రవరం సిటీ: పట్టణ ప్రాంతాల్లో పేదరికం నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని మెప్మా రాష్ట్ర మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్ అన్నారు. స్థానిక వేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల మునిసిపల్ కమిషనర్లు, మెప్మా సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పూర్ టూ రిచ్ విధి విధానాలపై దిశానిర్దేశం చేశారు. దానికి అనుగుణంగా క్షేత్రస్థాయి సిబ్బంది పనిచేయాలన్నారు. అనంతరం మెప్మా చేపడుతున్న ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలు తీరుపై సమీక్షించారు. సమావేశంలో మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ బి.ప్రియంవద పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగఫలమే ప్రశాంత జీవనం



పోలీసు శాఖ అందించే సేవలను వివరిస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్

కంబాలచెరువు: దేశ అంతర్గత భద్రతలో భాగంగా ఎందరో పోలీసులు అమరవీరులయ్యారని, వారి త్యాగాల ఫలమే ప్రజల ప్రశాంత జీవనమని ఎస్పీ నరసింహ కిషోర్ అన్నారు. పోలీస్ అమరవీరుల స్మారకోత్సవాలలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. పోలీసు శాఖ అందించే సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ క్రైమ్ విభాగం ప్రదర్శించిన సైబర్ నేరాలపై అవగాహన ప్లకార్డులు, వీడియోలు ఆకట్టుకున్నాయి. ముందుగా పోలీసు అమర వీరులను స్మరించుకున్నారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రజల మాన, ప్రాణ రక్షణలో అంకితభావంతో పనిచేసే పోలీసులను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. కార్యక్రమంలో లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్పీ అల్లూరి వెంకట సుబ్బరాజు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ అనసూరి శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే ప్రగతి సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న టీచర్స్ గిల్డ్ రాష్ట్ర అధ్యక్షుడు చిట్టిబాబు

కంబాలచెరువు: సమష్టి కృషితోనే ప్రగతి సాధ్యమని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ రాష్ట్ర అధ్యక్షుడు బి.చిట్టిబాబు అన్నారు. జాంపేటలోని లూథరన్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో శనివారం ఆ సంస్థ జిల్లా కమిటీ సభ్యులతో ఐక్యతా సమావేశం నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ విద్యావ్యవస్థలో ఎయిడెడ్ పాఠశాలలకు ఘన చరిత్ర ఉందన్నారు. ప్రస్తుతం వచ్చిన పెనుమార్పుల కారణంగా అన్ని పాఠశాలలతో పాటు ఎయిడెడ్ పాఠశాలపైనా ప్రభావం పడిందన్నారు. పాఠశాలల్లో కూడా విద్యార్థుల రోలు తగ్గిందన్నారు. ఉపాధ్యాయులందరూ మరింత కృషి చేసి విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. అనంతరం ఎయిడెడ్ ఉపాధ్యాయులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించారు. నూతనంగా ఉద్యోగంలో చేరినవారి జీతాలు, హెల్త్ కార్డుల విషయంపై ఉన్నతాధికారులను త్వరలో కలుస్తామన్నారు. జిల్లా అధ్యక్షుడు టి.మార్టిన్ సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో లూథరన్ ఎయిడెడ్ హైస్కూల్ కరస్పాండెంట్ ఎం.ఐ.జయ, ఏపీటీజీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌హెచ్ అమూల్య బాల తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి శంకుస్థాపన

కడియం: కూటమి ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధి జరుగుతోందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం కడియం, వేమగిరి గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. కడియం గ్రామ సచివాలయం–4 నూతన భవనాన్ని ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు తెలిపారు. ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, కడియం సర్పంచ్ మోసిగంటి సత్యవతి, మండల టీడీపీ అధ్యక్షుడు వెలుగుబంటి నాని, వేమగిరి మాజీ సర్పంచ్ వెలుగుబంటి వెంకటాచలం పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట



టీడీపీ సభ్యత్వాలు అందజేస్తున్న మంత్రి రామానాయుడు, ఎమ్మెల్యే బుచ్చయ్య తదితరులు

రాజమహేంద్రవరం రూరల్:. తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నామని ఇరిగేషన్‌శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొత్తపల్లి జవహర్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరితో కలిసి ఆయన ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రతి రెండేళ్లకోసారి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. సభ్యత్వం కోసం వంద రూపాయలు చెల్లించాలన్నారు. వారికి రూ.5 లక్షల ప్రమాద బీమా, సహజ మరణానికి మట్టి ఖర్చుల కోసం రూ.పది వేలు అందిస్తామని తెలిపారు. ఎంపీపీ వెలుగుబంటి సత్య ప్రసాద్, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, పిల్లా తనుజా తమ సభ్యత్వాలను పునరుద్ధరించుకున్నారు.

యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయం



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న సిటీ ఎమ్మెల్యే శ్రీనివాస్

సీటీఆర్ఐ: ప్రతిభ కలిగిన యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. అందులో భాగంగా తన పుట్టిన రోజున సొంత ఖర్చులతో సుమారు 80 కంపెనీలతో మెగా జాబ్ మేళా ఏర్పాటు చేశామన్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శనివారం జరిగిన మెగా జాబ్ మేళాలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగ యువతకు స్కిల్స్ శిక్షణ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ మేరకు అమరావతి సొల్యూషన్స్ సంస్థతో మాట్లాడామన్నారు. ప్రతి మూడు నెలలకు వంద మందికి స్కిల్ ట్రైనింగ్ ఇస్తామని, దీనికి రూ.20 వేలు ఖర్చవుతుందన్నారు. అయితే తమ భవాని చారిటబుల్ ట్రస్ట్ తరపున ఒక్కొక్కరికీ రూ.15 వేలు చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



దిమ్మ పగుళ్లు తీయడంతో ఒరిగిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

రాజమహేంద్రవరం రూరల్: కవలగొయ్యి గ్రామానికి వెళ్లే రోడ్డులో ఓఎన్‌జీసీ కార్యాలయం ప్రహరీ పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్‌ను ఉంచిన దిమ్మ పగుళ్లు దీసింది. ట్రాన్స్‌ఫార్మర్ ఒక వైపునకు ఒరిగిపోయింది. దీంతో ఏ సమయంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. విద్యుత్‌శాఖాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సినిమాలు



శ్యామల	: వేట్టయన్
సూర్యమినీ	: జనక అయితే గనక
సూర్యప్యాలెస్	: వెనమ్
శివజ్యోతి	: పొట్టేల్
అనుశ్రీ	: వెనమ్
స్వామి	: వెనమ్
అశోక	: విశ్వం
రాజా	: వెనమ్
రంభ	: సత్యం సుందరం, ఎంతపని చేసావురా చంటి
ఊర్వశి	: లగ్గం
మేనక	: నరుడి బ్రతుకు నటన
కుమారి	: దేవర
అప్సర	: దేవర
నామవరం	
వీఎస్ మహల్	: వెనమ్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: వెనమ్
కడియం	
వెంకటసూర్య	: వెనమ్